క్లుప్తంగా

విజిలెన్స్ తనిఖీలు

- రూ.48 లక్షల విలువైన ఎరువుల సీజ్



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ, ఏఓ

పొదలకూరు: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వీరి రాక గురించి తెలుసుకున్న కొందరు యజమానులు దుకాణాలను మూసి వేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు శ్రీసాయిబాబా ఫర్టిలైజర్స్‌లో ఎరువుల స్టాక్ వివరాలు పరిశీలించారు. రూ.42,94,845 విలువైన 201.515 మెట్రిక్ టన్నులు ఎరువులకు రికార్డులు సక్రమంగా లేవని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. లక్ష్మీ వెంకటేశ్వర దుకాణంలో ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించి రూ.5.32 లక్షల ఎరువులకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేవని 6ఏ కేసు నమోదు చేశారు. మరో రూ.లక్ష విలువైన పురుగు మందులకు స్టాపింగ్ ఆర్డర్ ఇచ్చారు. సీఐ వెంట మండల వ్యవసాయాధికారి ఎ.వాసు, ఇంకా సుబ్బయ్య, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు. చాలామంది వ్యాపారులు తమ దుకాణాలను మూసి వేయడంతో ఎరువుల కోసం వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు.

ఫ్రైడే.. డ్రైడేతో వ్యాధులు దూరం



సూచనలు చేస్తున్న నాగార్జునరావు

కొడవలూరు: ఫ్రైడే.. డ్రైడేను పాటించడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేయొచ్చని జిల్లా సహాయ మలేరియాధికారి నాగార్జునరావు పేర్కొన్నారు. కొడవలూరులో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దోమలను నివారించి సీజనల్ వ్యాధులకు కళ్లెం వేయాలని కోరారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమలతో డెంగీ, మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే అవకాశం ఉందని, ఈ క్రమంలో ఫ్రైడే.. డ్రైడేను విధిగా పాటించాలని కోరారు. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి మలాథియాన్‌ను పిచికారీ చేసి దోమల లార్వాలను నివారించాలని చెప్పారు. తొలుత పీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులను పరిశీలించి, వైద్యాధికారి రామకృష్ణతో చర్చించారు. సీహెచ్ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏ షఫీవుద్దీన్, ఎల్టీ మెర్సీ, ఏఎన్ఎం సుభాషిణి పాల్గొన్నారు.

మాలల మహాగర్జన రేపు



బుచ్చిరెడ్డిపాళెం: మాలల మహాగర్జనను గుంటూరులో ఆదివారం నిర్వహించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన దళిత నేత భీమతాటి వెంకటరమణయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. నేతలు విల్సన్, మధు, వెంకట్, చెన్నయ్య, అశోక్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

16న సింహపురి యునైటెడ్ క్యారల్స్



నెల్లూరు(బృందావనం): యేసుక్రీస్తు జనన సందేశాన్ని సంగీతం ద్వారా తెలియజేసే సింహపురి యునైటెడ్ క్యారల్స్‌ను సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నామని బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సంతపేటలోని బిషప్ హౌస్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం కన్వీనర్ రెవరెండ్ డేవిడ్ దయాసాగర్ మాట్లాడారు. గాయక, వాద్య బృందాలు శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించనున్నారని చెప్పారు. అనంతరం కో కన్వీనర్ జానీజో మాట్లాడారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి సాయంత్రం 6.30కు ప్రారంభంకానున్న ర్యాలీ వివిధ ప్రాంతాల మీదుగా బట్వాడిపాళెం సెంటర్ వరకు సాగుతుందని వివరించారు. సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ సంస్థ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్, ఫాదర్ ఇన్నయ్య, ఊరందూరు సురేంద్రబాబు, రెవరెండ్ రాజశేఖర్ దాసరి, రెవరెండ్. సందీప్, అసోసియేట్లు విద్యాధర్, మహేష్, దినేష్, ఫ్రైజర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలు.. ప్రజలకు కష్టాలు

- ముత్తుకూరులో భారీ వాహనాల రాకపోకలు
- జనం బెంబేలు
- దుకాణాల నిండా దుమ్ము
- బైపాస్ రోడ్డు అవసరమంటున్న ప్రజానీకం



ముత్తుకూరులో టిప్పర్, ట్యాంకర్ల రాకపోకలు

ముత్తుకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు మండలానికి జిల్లాలో ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడే అదానీ కృష్ణపట్నం ఉంది. ఇంకా వివిధ పరిశ్రమలున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎంతో మంది ఉద్యోగులు అక్కడి నుంచి నగరానికి వస్తుంటారు. స్థానికంగానూ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి పొందుతున్నారు. అలాంటి ప్రదేశంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి.

పెరిగిన వాహనాల సంఖ్య

ముత్తుకూరులోని ప్రధాన రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు బాగా పెరిగాయి. దీంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఒక రోడ్డులో కృష్ణపట్నం పోర్టు, సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరో పంటపాళెం పామాయిల్ ఫ్యాక్టరీ వాహనాలు తిరుగుంటాయి. ఇంకా వెంకటాచలం జాతీయ రహదారి వైపు ప్రయాణించే వాహనాలు అనేకం ఉన్నాయి. ముత్తుకూరు మీదుగా నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్, ఎస్ఈఐఎల్ పవర్ ప్రాజెక్ట్‌కు వెళ్లే లారీలు తదితరాలు క్రమంగా ఎక్కువయ్యాయి.

దుమ్ము లేస్తోంది

ఉదయం నుంచి సాయంత్రం వరకు పోర్టు వైపు నీళ్లు మోసుకెళ్లే ట్యాంకర్లు రోడ్లో దుమ్ము లేపుతున్నాయి. వెంకటాచలం వైపు పెద్ద సంఖ్యలో తిరిగే టిప్పర్లు, బూడిద బల్కర్లు, మట్టి, ఇసుక తరలించే ట్రాక్టర్లు, లారీల శబ్దాల హారన్లకు స్థానికులు హడలిపోతున్నారు. రోడ్డుకిరువైపులా దుకాణాల్లో వస్తువులు, పరికరాలు, దుస్తులు, విలువైన ఎలక్ట్రానిక్ సామగ్రి దుమ్ముతో మట్టికొట్టుకుపోతున్నాయి. పరిశ్రమల ప్రైవేట్ బస్సులు, కార్మికులను తరలించే వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రద్దీ వల్ల రోడ్డు దాటాలంటేనే భయపడిపోతున్నారు. రోడ్డు పక్కనే ఉన్న జెడ్పీ హైస్కూల్, గురుకుల పాఠశాల, ఇతర స్కూళ్ల విద్యార్థుల ఏకాగ్రతకు భంగం ఏర్పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజానీకం కోరుతోంది. ముత్తుకూరుకు బైపాస్ రోడ్డు అవసరమని అనేకమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ముత్తుకూరు సమీపంలో ఇటీవల గ్రామస్తులు నిలిపివేసిన భారీ వాహనాలు

చెరువుకట్ట రోడ్డును అభివృద్ధి చేయాలి



వెంకటాచలం, పంటపాళెం వైపు ప్రయాణించే భారీ వాహనాల కోసం పెద్ద చెరువుకట్ట రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇటీవల కొద్దిరోజులు ఈ మార్గంలో వాహనాలు నడిపారు. తర్వాత ఎందుకు ఆపేశారో తెలియదు. దుమ్ము లేవకుండా రోడ్డుపై నీళ్లు చల్లాలి.

– షేక్ నవీద్, ఎంపీటీసీ సభ్యుడు



అభివృద్ధి చేయాల్సిన పెద్ద చెరువు కట్ట రోడ్డు

బైపాస్ రోడ్డు అవసరం



ముత్తుకూరుకు బైపాస్ రోడ్డు అవసరం చాలా ఉంది. పెరిగిన భారీ వాహనాల సంఖ్యను పరిగణలోకి తీసుకుని, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బైపాస్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వాహనాల వేగంపై, హారన్లపై ఆంక్షలు విధించాలి.

– గండవరం సుగుణ, ఎంపీపీ

రోడ్డు దాటాలంటే భయంగా ఉంది



ముత్తుకూరులో ఉదయం, సాయంత్రం రోడ్డు దాటాలంటే భయంగా ఉంటోంది. అటు, ఇటు ప్రయాణించే భారీ వాహనాల వేగం, శబ్దాలే దీనికి కారణం. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలి.

– బైనా రామయ్య, స్థానికుడు

పరీక్షల్లో ఇద్దరు డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబారైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 3,156 మందికి గానూ 526 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. నెల్లూరు నగరంలో వేర్వేరు కాలేజీలో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారన్నారు.

నేడు దత్త జయంతి

పొదలకూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం దత్తాత్రేయ జయంతిని నిర్వహిస్తామని మందిర సేవా సమితి సొసైటీ కార్యదర్శి నాగిశెట్టి దామోదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు



ముత్తుకూరు: ఎన్నికల సామగ్రి అందజేత

పొదలకూరు: మండలంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్టు ఇరిగేషన్ ఏఈ అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 29 సంఘాలకు ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారులను నియమించినట్టు పేర్కొన్నారు.

- **ముత్తుకూరు:** మండలంలో శనివారం జరగబోయే సాగునీటి సంఘాలకు ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని శుక్రవారం ఆయా ఎన్నికల అధికారులకు అందజేశారు. డీటీ ప్రదీప్, ఇరిగేషన్ ఏఈ వేమారెడ్డి, వ్యవసాయాధికారి జ్యోత్స్నారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల జీవనోపాధి మెరుగుపడాలి



మాట్లాడుతున్న డాక్టర్ బాలసుబ్రమణియన్

ముత్తుకూరు: సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా సన్న, చిన్నకారు రైతుల జీవనోపాధి మెరుగుపడాలని ముత్తుకూరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ అన్నారు. కళాశాలలో శుక్రవారం జరిగిన సమీకృత వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐసీఏఆర్, సీఐఎఫ్ఈ, మత్స్య కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మురళీధర్‌లు మాట్లాడుతూ చేపలు – వరి, చేపలు – బాతులు, చేపలు – కోళ్లు, చేపలు – గొర్రెల తదితర సమీకృత వ్యవసాయ పద్ధతులను అలవరుచుకోవాలన్నారు. సామగ్రిని రైతులకు అందజేశారు. మత్స్య విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ ధనపాల్, డాక్టర్ మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరు ఆర్ అండ్ఆర్ కాలనీలోని అదానీ విద్యా మందిర్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగశాల, ఇతర సదుపాయాలతో అత్యాధునికంగా గదుల నిర్మాణం జరుగుతుందన్నారు. మత్స్యకారుల పిల్లల విద్యాభివృద్ధికి అదానీ ఫౌండేషన్ కట్టుబడి ఉందన్నారు. జూనియర్ కళాశాల ద్వారా ఉన్నత విద్య అందించాలన్నదే ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతి ఆశయమన్నారు. కార్యక్రమంలో రాజేష్ రంజన్, శ్రీనివాసరావు, గణేష్‌శర్మ, వేణుగోపాల్, మృత్యుంజయరామ్, వెంకటేష్ భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సీఈఓ

ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారులు

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం ఆరోగ్య శాఖ అధికారులు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్లు శ్రీకావ్య, మోహన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఆశ వర్కర్లు రమాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న శ్రీహరి

బుచ్చిరెడ్డిపాళెం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని పరిశీలకుడు ప్రసాద్ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కెనరా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవిశంకర్, డిస్ట్రిక్ట్ ట్రెయినింగ్ మేనేజర్ శివ, ఎంపీడీఓ శ్రీహరి, మండల విస్తరణాధికారి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సిబ్బంది

జర్నలిస్టులపై దాడులు అమానుషం



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

తోటపల్లిగూడూరు: జర్నలిస్టులపై దాడులు అమానుషమని మండలంలోని పత్రిక, మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లాలో సాక్షి రిపోర్టర్లపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. డీటీ శివయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై అధికార పార్టీ నాయకులు దాడులకు దిగడం దారుణమన్నారు. హైదరాబాద్‌లో కవరేజ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై సినీ నటుడు దాడి చేసిన ఘటనను మరువక ముందే వైఎస్సార్ జిల్లాలో మరొకటి జరగడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ

- పలువురికి స్వల్పగాయాలు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన కొందరు టూరిస్ట్ బస్సులో తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి సొంతూరికి బయలుదేరారు. మనుబోలు బైపాస్ వద్ద ముందు వెళ్తున్న వాహనం ఒక్కసారిగా నెమ్మదించడంతో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనుక వస్తున్న లారీ వేగాన్ని అదుపు చేయలేక బస్సును ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ దేవాతోపాటు బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



దెబ్బతిన్న బస్సు వెనుక భాగం

రెవెన్యూ సదస్సుల్లో స్వల్పంగా అర్జీలు



కొడవలూరు: అర్జీలను స్వీకరిస్తున్న స్ఫూర్తి

పొదలకూరు: మండలంలోని బత్తులపల్లి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ బి.శివకృష్ణ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఐదు అర్జీలను అందజేశారు. పట్టాభూమి అనాధీనంగా ఉందని, పట్టాదారు పాసుపుస్తకాల కోసం అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. పాసుపుస్తకాల కోసం వెంటనే దరఖాస్తు చేయించినట్టు తహసీల్దార్ వెల్లడించారు.

- **మనుబోలు:** మండలంలోని గురివిందపూడి, అనుపల్లిపాడు గ్రామాల్లో శుక్రవారం సదస్సులు జరిగాయి. తహసీల్దార్ సుబ్బయ్య మాట్లాడుతూ పాసుపుస్తకాలు, భూ పట్టాలు, అడంగల్‌లో పేర్ల నమోదు తదితర సమస్యలపై అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు శ్రీనివాసరావు, వంశీకృష్ణ, వీఆర్వో శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: రెవెన్యూ సదస్సుల్లో తెలియజేసే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ స్ఫూర్తి పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపురం, దామేగుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె మాట్లాడారు. సదస్సుల్లో రెవెన్యూ సమస్యలే కాక ఇతర శాఖల సమస్యలూ వస్తున్నాయని చెప్పారు. పింఛన్, రేషన్ కార్డులు, పక్కా గృహాలకు సంబంధించిన సమస్యలను ఆయా శాఖలకు పంపి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. సచివాలయాల్లో యాప్‌ను ఓపెన్ చేయకపోవడంతో జాప్యం జరుగుతోందని చెప్పారు. కమ్యూనిటీ సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.



మనుబోలు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

పల్లెల్లో వానరాల బెడద

- అధికారులకు ఫిర్యాదు చేసిన జనం
- ఫలితం శూన్యం

వెంకటాచలం: గ్రామాల్లో కోతుల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలున్నాయి. చాలా వాటిల్లో వానరాలు ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆదమరిస్తే చాలు.. నివాసాల్లోకి వచ్చి వస్తువులను కింద పడేస్తున్నాయని, తినుబండారాలను తీసుకెళ్తున్నాయని మహిళలు వాపోతున్నారు. తిక్కవరప్పాడు, సర్వేపల్లి, చవటపాళెం, ఇడిమేపల్లి, కంటేపల్లి, అనికేపల్లి, కాకుటూరు, చెముడుగుంట, పాలిచెర్లపాడు, కసుమూరు తదితర గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉంది.

- కోతుల బెడద నివాసాలకే పరిమితం కాలేదు. పంట పొలాల్లో ఉంటూ వరినాట్లను దెబ్బతీస్తున్నాయి. అలాగే కూరగాయలు సాగు చేసిన పొలాల్లో కాయలు, పిందెలు, పూతను చీల్చేస్తూ తీవ్ర నష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం తిక్కవరప్పాడు, కంటేపల్లి, రామదాసుకండ్రిగ తదితర గ్రామాల్లో ముందుగా వేసిన వరినాట్లు కోతుల వల్ల దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలిచెర్లపాడు గ్రామంలో నిమ్మ తోటలు, కూరగాయల సాగుకు తీవ్ర నష్టం చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. పంచాయతీల్లో నిధుల సమస్య కారణంగా తాము కోతులు పట్టించలేమని అధికారులు చెబుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



తిక్కవరప్పాడులో పొలాల వద్ద కోతులు

తీవ్ర నష్టం



కోతుల కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. నిమ్మ తోటల్లో, కూరగాయలు సాగు చేసే పొలాల్లో నిత్యం కోతులు తిరుగుతూ కాయలను చీల్చేస్తున్నాయి. నివాసాల్లోకి వచ్చి వస్తువులను లాక్కెళ్లిపోతున్నాయి. అధికారులు సమస్యలను పరిష్కరించాలి.

– ప్రసాద్, పాలిచెర్లపాడు

కోతులను పట్టించాలి



నిత్యం కోతులు నివాసాల చుట్టూ తిరుగుతున్నాయి. ఆదమరిస్తే కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లిపోతున్నాయి. తరిమే ప్రయత్నం చేసినా ఉపయోగం లేదు. వెంటనే వానరాలను పట్టించాలి.

– వెంకటేశ్వర్లు, పాలిచెర్లపాడు